ప్రభాత
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
25-11-2024
సోమవారం
మల్కాజిగిరి
సంపుటి : 02 | సంచిక : 79| పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB జయభేరి




ఈనెల 29న బీఆర్ఎస్ ఆధ్వర్యంలో దీక్షా దివస్ నిర్వహించాలని.. కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే తెలంగాణలో మళ్లీ అదే అంధకారమనే పరిస్థితి వచ్చిందన్నారు. తెలంగాణపై కేసీఆర్ ముద్రను ఎవరూ చెరిపేయలేరని స్పష్టం చేశారు.

**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ ప్రజల 60 ఏళ్ల ఆకాంక్షకు అనుగుణంగా ఏప్రిల్ 27, 2001 నాడు గులాబీ జెండాను ఎగరవేసిన నాయకులు కేసీఆర్.. అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. తెలంగాణ మలిదశ ఉద్యమాన్ని మలుపు తిప్పి.. తెలంగాణ ఉద్యమ చరిత్రపై కేసీఆర్ అనే చెరిగిపోని సంతకం చేసిన మహానాయకులు అని స్పష్టం చేశారు. నవంబర్ 29, 2009న కేసీఆర్ చేపట్టిన నిరాహార దీక్ష తెలంగాణ ఉద్యమాన్ని మలుపు తిప్పిన రోజని అందరికీ తెలుసన్నారు. 'స్వరాష్ట్ర కల సాకారానికి పునాది వేసిన రోజుగా తెలంగాణ చరిత్రలో నిలిచిపోయే శుభదినం. ఆనాడు కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ తెచ్చుడో అని తెగువ కనబరిచిన నాయకుడికి 3 కోట్ల మంది ప్రజలు ముక్త కంఠంతో అండగా నిలబడ్డారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేశ రాజకీయ వ్యవస్థను ఒప్పించి, మెప్పించి.. కులాలకు మతాలకు అతీతంగా అందరినీ కలిపిన సందర్భం దీక్షా దివస్' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. 'అప్పుడున్న సమైక్య రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో ప్రతి వర్గం, ప్రతి మనిషి బతుకు ఛిద్రం అయ్యింది. మళ్లీ ఈ రోజు అవే పరిస్థితులు కనిపిస్తున్నాయి. అవే నిర్బంధాలు, అవే అణచివేతలు, అవే దుర్భర పరిస్థితుల నేపథ్యం కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కనిపిస్తున్నాయి. ఆనాడు ఢిల్లీ మెడలు వంచి తెలంగాణ సాధించిన కేసీఆర్ స్ఫూర్తితో.. నేడు మళ్లీ రెండు జాతీయ పార్టీల మెడలు వంచాల్సిన పరిస్థితి ప్రతి పౌరుని మీద ఉన్నది' అని కేటీఆర్ స్పష్టం చేశారు.

...మిగతాది 2 లో

# నేటి నుంచి పార్లమెంట్



2 లో

పార్లమెంట్ శీతాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. డిసెంబర్ 20 వరకు జరిగే ఈ సమావేశాల్లో వక్ఫ్ (సవరణ) సహా 16 బిల్లులను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్నది. మణిపూర్ హింస, గౌతమ్ అదానీ అవినీతి చర్యలపై యూఎస్ అరెస్ట్ వారెంట్ తదితర అంశాలపై ఈ సమావేశాల్లో మోదీ సర్కారును నిలదీసేందుకు విపక్షాలు సిద్ధమవుతున్నాయి. అదానీ అంశంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి విపక్షం పట్టుబట్టవచ్చు. దేశమంతా ఏకకాలంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన జమిలి ఎన్నికల బిల్లును లిస్టులో చేర్చకపోయినా దానిని ప్రవేశపెట్టవచ్చునని భావిస్తున్నారు. కాగా, పార్లమెంట్ శీతాకాల సమావేశాలు సజావుగా సాగేలా సహకరించాలని కేంద్ర ప్రభుత్వం అఖిల పక్ష సమావేశంలో విజ్ఞప్తి చేసింది. అయితే అదానీ అవినీతి, మణిపూర్ అల్లర్లపై చర్చ జరగాలని విపక్ష సభ్యులు డిమాండ్ చేశారు.



## విద్యార్థులకు రూ.6,500 కోట్లు

### జగన్‌కు మంత్రి లోకేష్ స్ట్రాంగ్ కౌంటర్!

ఏపీలో ట్వీట్ ఫైట్ నడుస్తోంది. విద్యా వ్యవస్థ గురించి ప్రభుత్వానికి జగన్ ప్రశ్నలు సంధించగా.. తాజాగా మంత్రి నారా లోకేష్ రియాక్ట్ అయ్యారు. జగన్‌కు కౌంటర్ ఇచ్చారు. విద్యార్థులకు రూ.6,500 కోట్ల బకాయిలు పెట్టి వెళ్లారని విమర్శించారు. ఆఖరికి విద్యార్థులను కూడా మోసం చేశారని ఆరోపించారు. ట్విట్టర్‌లో జగన్ సంధించిన ప్రశ్నలకు మంత్రి నారా లోకేష్ కౌంటర్ ఇచ్చారు.

...మిగతాది 2 లో

## హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఇల్లు బఫర్ జోన్ లో..




హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఇల్లు బఫర్ జోన్ లో ఉందని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఈ ప్రచారంపై ఏవీ రంగనాథ్ స్పందించారు. తన ఇల్లు బఫర్ జోన్ లో లేదని క్లారిటీ ఇచ్చారు. 44 ఏళ్ల క్రితం తన తండ్రి నిర్మించిన ఇంట్లోనే ఉంటున్నామన్నారు.

**జయభేరి, హైదరాబాద్ :**

హైడ్రా పేరు చెబితే హైదరాబాద్ లో అక్రమ నిర్మాణదారులు వణికిపోతున్నారు. ఎఫ్టీఎల్, బఫర్ జోన్ లో ఉన్న నిర్మాణాలను హైడ్రా బుల్డోజర్లు కూల్చివేస్తున్నాయి. అయితే తాజాగా సోషల్ మీడియోలో ఓ వార్త చక్కర్లు కొడుతుంది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఇల్లు కూడా బఫర్ జోన్ లో ఉందని ప్రచారం జరుగుతోంది. ఆయన ఇంటిని కూడా కూల్చివేయాలని డిమాండ్ వస్తుంది. ఈ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందించారు. తన ఇల్లు బఫర్ జోన్ లో ఉన్న విషయంపై వస్తున్న వార్తలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్లారిటీ ఇచ్చారు. మధురానగర్‌లోని తన ఇల్లు బఫర్ జోన్‌లో ఉందంటూ అసత్య ప్రచారం చేస్తున్నారని, ఈ వార్తల్లో వాస్తవం లేదన్నారు. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం అవాస్తవం అన్నారు. 44 ఏళ్ల క్రితం తన తండ్రి నిర్మించిన ఇంట్లోనే ఉంటున్నామన్నారు. అయితే ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు

...మిగతాది 2 లో



## గౌతమ్ అదానీకి బంగ్లాదేశ్ షాక్!

**జయభేరి, ఢాకా :**

గౌతమ్ అదానీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. సౌర విద్యుత్తు కాంట్రాక్టులు పొందేందుకు రూ.2,200 కోట్లు లంచం ఇచ్చారన్న ఆరోపణలపై అదానీపై అమెరికాలో కేసు నమోదైన నేపథ్యంలో అదానీ గ్రూప్‌తో విద్యుత్తు ఒప్పందాలను రద్దు చేసుకుంటున్నట్టు ఇప్పటికే కెన్యా ప్రకటించగా, తాజాగా బంగ్లాదేశ్ కూడా ఇదే నిర్ణయం తీసుకుంది. అదానీ కంపెనీతో మునుపటి హసీనా ప్రభుత్వం చేసుకున్న

...మిగతాది 2 లో

## మాల.. మాదిగల కొట్లాట... మనువాదులకు కన్నుల పంట..!?

2 లో



## అబద్దాల్లో సీఎం రేవంత్ రెడ్డికి పిహెచ్‌డీ ఇవ్వాలి

అబద్ధాలు చెప్పడంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పిహెచ్డీ ఇవ్వాలన్నారు బిజేపి నేత సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు. అబద్దాలు చెప్పి మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో ఏమేమి ఎగబెట్టారో అక్కడ ప్రజలకు గుర్తొచ్చిందన్నారు. తెలంగాణ మహారాష్ట్రకు మధ్య వెయ్యి కిలోమీటర్ల సరిహద్దు ఉందని, ఇక్కడ ప్రజలకు ఎగ్గొట్టిన ఆరు గ్యారంటీల మోసాన్ని గ్రహించి మహారాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ ను ఓడించారని హరీష్‌రావు స్పష్టం చేశారు.

ఇప్పటికైనా కాంగ్రెస్ నేతలు సీఎం కళ్ళు తెరిచి బుద్ధి తెచ్చుకోవాలని సూచించారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో మాజీ మంత్రులు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తో కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొన్న హరీష్ రావు కాంగ్రెస్ తీరు బిజెపి వైఖరిపై మండిపడ్డారు. వందరోజుల్లో 6 గ్యారంటీలు అమలు చేస్తామని మోసం చేశారని ఆరోపించారు. బాండ్ పేపర్ మీద రాసిచ్చి, దేవుళ్ళ మీద ఒట్టు పెట్టి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. మీరు ఇచ్చిన ఏడో గ్యారెంటీ ప్రజాస్వామ్యం.. ఇక్కడ ఖూనీ అయిపోయిందని ఆరోపించారు.

**దళిత బంధు వెంటనే ఇవ్వాలి...**

హుజురాబాద్ లో 18500 మందికి దళిత బంధు కేసీఆర్ మంజూరు చేశారని హరీష్ రావు తెలిపారు. వారిలో కొందరికి ఆగిపోయిన ఐదు లక్షలు ఇవ్వమంటే వారిపై పోలీసులతో దాడి చేసి లాఠీ చార్జ్ చేయించారని ఆరోపించారు. ఉపముఖ్యమంత్రి భట్టి దళితులకు చేసే మేలు ఇదేనా? అని ప్రశ్నించారు.

...మిగతాది 2 లో



## జామా మసీదు సర్వేలో ఉద్రిక్తత

ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్‌లో షాహీ జామా మసీదు సర్వే సందర్భంగా ఆదివారం ఉదయం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆందోళనకారులు రాళ్లు రువ్వడంతో పోలీసులు బాష్పవాయువు గోళాలను ప్రయోగించారు. లాఠీచార్జి చేశారు. ఈ ఘటనల్లో

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## నేటి నుంచి పార్లమెంట్

రాజ్యాంగ ఆమోద 75వ వార్షికోత్సవ వేడుకల ప్రారంభోత్సవానికి గుర్తుగా మంగళవారం నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో పాత పార్లమెంట్ భవనంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించనున్నారు. ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్, ప్రధాని నరేంద్ర మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కూడా పాత పార్లమెంట్ భవనంలోని సెంట్రల్ హాల్‌లో ప్రసంగిస్తారు. 'హమారా సంవిధాన్, హమారా స్వాభిమాన్' పేరుతో ఏడాది పాటు ఈ ఉత్సవాలను నిర్వహించనున్నట్లు పార్లమెంట్ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఆదివారం తెలిపారు.

## ఈనెల 29న దీక్షా దివస్

'కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే తెలంగాణలో మళ్లీ అదే అంధకారమనే పరిస్థితి వచ్చింది. ఒక్క వర్గం కాదు.. సంపన్న వర్గాల నుంచి అట్టడుగు వర్గాల వరకు అందరూ బాధపడుతున్నారు. అందుకే దీక్షా దివస్ నుంచి స్ఫూర్తి పొంది.. కాంగ్రెస్ కబంధ హస్తల నుంచి నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలను కాపాడుకోవటానికి మరో సంకల్ప దీక్ష చేపట్టాల్సిన తరుణం ఆసన్నమైంది' అని కేటీఆర్ వివరించారు. 'స్వీయ రాజకీయ అస్తిత్వమే తెలంగాణకు శ్రీరామ రక్ష అని ప్రొఫెసర్ జయశంకర్ తరుచూ చెప్పేవారు. ఈ రోజు ప్రజలంతా కేసీఆర్ నాయకత్వాన్ని, ఆనాటి పాలనను కోరుకుంటున్నారు. దాని కోసం మా పార్టీ శ్రేణులు కలిసికట్టుగా ముందుకు వెళ్లాల్సిన సందర్భం. నవంబర్ 29న 33 జిల్లాల్లో మా పార్టీ కార్యాలయాల్లో ఘనంగా దీక్షా దివస్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నాం. తెలంగాణ పై కేసీఆర్ ఏ విధంగా చెరగని ముద్ర వేశారో మళ్లీ గుర్తు చేసుకుంటూ.. రెండు జాతీయ పార్టీలకు బుద్ధి చెప్పేందుకు కదం తొక్కుతాం' అని కేటీఆర్ పిలుపునిచ్చారు. '29 నవంబర్ రోజు పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కదం తొక్కాలని పార్టీ నేతలకు పిలుపు ఇస్తున్నాం. ఈ కార్యక్రమాల నిర్వహణకు అన్ని జిల్లాలకు సీనియర్ నాయకులను ఇంఛార్జ్‌లుగా నియమించాం. దీక్షా దివాస్ కార్యక్రమ నిర్వహణ కోసం ఈ నెల 26న అన్ని జిల్లాల్లో సన్నాహాక సమావేశాలు నిర్వహిస్తాం. 29 నాడు దీక్షా దివస్ ఘనంగా నిర్వహించనున్నాం' అని కేటీఆర్ వివరించారు. 'కేసీఆర్ తన దీక్షను ముగించిన డిసెంబర్ 9వ తేదీన మేడ్చల్ లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తాం. మా పార్టీ నాయకులంతా ఆరోజు పెద్ద ఎత్తున ఉత్సవాలు చేస్తూ తెలంగాణ తల్లికి ప్రణమిల్లుతాం. కేసీఆర్ దీక్షలో నిమ్స్ హాస్పిటల్ పాత్ర కూడా ఘనమైనది. ఆ రోజు నిమ్స్ ఉద్యమానికి కేంద్ర బిందువుగా మారింది. అందుకే ఆ రోజు నిమ్స్ హాస్పిటల్‌లో అన్నదానం, రోగులకు పండ్లు పంపిణీ చేసాం. దీక్షా దివస్ తోపాటు తెలంగాణ తల్లి విగ్రహా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గులాబీ కుటుంబ సభ్యులకు పిలుపుసున్నా. ఈ దుర్మార్గ కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పాలనే సంకల్పంతోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం' అని కేటీఆర్ స్పష్టం చేశారు.

## హైడ్రా కమిషనర్ ఇల్లు బఫర్ జోన్ లో..

కొందరు ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఒకప్పటి పెద్ద చెరువును 25 ఏళ్ల క్రితం కృష్ణకాంత్ పార్కుగా మార్చారన్నారు. ఈ కృష్ణకాంత్ పార్క్‌కు తన ఇంటికి మధ్య వేలాది ఇండ్లు ఉన్నాయన్నారు. చెరువు కట్టకు దిగువన 10 మీటర్లు దాటితే బఫర్ జోన్ పరిధిలోకి రాదన్నారు. తన ఇల్లు చెరువు కట్టకు దాదాపు కిలో మీటర్ కు పైగా దూరంలో ఉందన్నారు.
హైదరాబాద్ పరిధిలోని చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములలో అక్రమ నిర్మాణాలను కూల్చివేసేందుకు ప్రభుత్వం హైడ్రాను రూపొందించింది. అక్రమ నిర్మాణాలపై కొరడా ఝులిపిస్తున్న హైడ్రా...బుల్డోజర్లతో విరుచుకుపడుంది. చెరువుల ఎఫ్టీఎల్, బఫర్ జోన్లలో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తుంది. హైడ్రా కూల్చివేతలతో విమర్శలు రావడంతో... ఇటీవల కాస్త స్పీడ్ తగ్గించింది. కూల్చివేతలతో హైడ్రా సామాన్యుల ఆగ్రహానికి గురైంది. తాజాగా హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఇల్లు కూడా బఫర్ జోన్‌లోనే ఉందని కాంగ్రెస్ బహిష్కృత నేత బక్కా జడ్సన్ సామాజిక మాధ్యమాల్లో వీడియోలు పోస్టు చేశారు. హైదరాబాద్ యూసుఫ్‌గూడ కృష్ణకాంత్ పార్క్ సమీపంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఇల్లు ఉంది. ఇది చెరువు బఫర్ జోన్ లో ఉందని బక్కా జడ్సన్ ఆరోపించారు. చంద్రబాబు హయాంలో పెద్ద చెరువును పూడ్చివేసి కృష్ణకాంత్ పార్కు నిర్మించారని చెప్పుకొచ్చారు. చెరువు గట్టున మైసమ్మ ఆలయం ఉంటుందని, కృష్ణకాంత్ పార్కు సమీపంలో కూడా మైసమ్మ గుడి ఉందన్నారు. గతంలో అక్కడ చెరువు ఉండేదని చెప్పేందుకు మైసమ్మ ఆలయమే నిదర్శనమన్నారు. వందేళ్ల క్రితం నాటి మ్యాప్ లలో ఆధారాలు కనిపిస్తాయన్నారు. రెండు నెలలు కష్టపడి వందేళ్ల నాటి పెద్ద చెరువు మ్యాప్ ను సంపాదించానని బక్కా జడ్సన్ అన్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఉంటున్న ప్రస్తుత ఇల్లు పెద్ద చెరువు బఫర్ జోన్‌లోనే ఉందని చెప్పుకొచ్చారు. తన ఇల్లు చెరువు బఫర్ జోన్‌లో లేదని ఏవీ రంగనాథ్ నిరూపించుకోవాలని జడ్సన్ సవాల్ విసిరారు.

## గౌతమ్ అదానీకి బంగ్లాదేశ్ షాక్!

విద్యుత్తు ఒప్పందాన్ని సమీక్షించనున్నట్టు తాజాగా తాత్కాలిక ప్రభుత్వం ఆదివారం ప్రకటించింది. విద్యుదుత్పత్తి ఒప్పందాలను సమీక్షించేందుకు లీగల్, ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీని నియమించాలని విద్యుత్తు, ఇంధనం, ఖనిజ వనరుల శాఖపై జాతీయ సమీక్షా కమిటీ సిఫారసు చేసిందని తాత్కాలిక ప్రభుత్వం తెలిపింది. ఈ కమిటీ ప్రస్తుతం ఏడు మేజర్ ఎనర్జీ, పవర్ ప్రాజెక్టులను సమీక్షిస్తున్నట్లు వెల్లడించింది. వీటిలో అదానీ గ్రూప్ యాజమాన్యంలోని బీఐఎఫ్‌పీసీఎల్ 1234.4 మెగావాట్ల కంపెనీ కూడా ఉన్నట్లు వివరించింది. పారిశ్రామిక దిగ్గజం గౌతమ్ అదానీపై అమెరికాలో నమోదైన కేసుపై దర్యాప్తు జరపాలని కోరుతూ సుప్రీంకోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. అదానీ-హిండెన్‌బర్గ్ వివాదంలో దాఖలైన పిటిషన్లపై జరుగుతున్న విచారణలో భాగంగా ఈ పిటిషన్‌ను అడ్వకేట్ విశాల్ తివారీ దాఖలు చేశారు. అదానీ గ్రూప్ స్టాక్ ధరల మాయాజాలానికి పాల్పడినట్లు హిండెన్‌బర్గ్ నివేదిక ఆరోపించిన సంగతి తెలిసిందే. అదానీ గ్రూప్ భారత్‌లో సౌర విద్యుత్తు కాంట్రాక్టులను పొందడం కోసం కొందరు నేతలకు రూ.2,200 కోట్ల మేరకు లంచాలు ఇచ్చినట్లు అమెరికా న్యాయ శాఖ తాజాగా ఆరోపించింది. దీనిపై అమెరికన్ కోర్టు సమన్లు కూడా పంపింది. ఈ ఆరోపణలను అదానీ గ్రూప్ తోసిపుచ్చింది. అన్ని చట్టాలకు అనుగుణంగానే కార్యకలాపాలను నిర్వహిస్తున్నామని తెలిపింది. విశాల్ తివారీ తాజాగా సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో, అదానీపై వచ్చిన ఆరోపణలు చాలా తీవ్రమైనవని చెప్పారు. వీటిపై భారతీయ వ్యవస్థల చేత దర్యాప్తు చేయించాలని కోరారు.

## జామా మసీదు సర్వేలో ఉద్రిక్తత

ముగ్గురు ఆందోళనకారులు మృతిచెందగా.. 30 మంది పోలీసులు గాయపడ్డారు. షాహీ జామా మసీదు ప్రాంతంలో హరిహర ఆలయం ఉండేదని పేర్కొంటూ సుప్రీంకోర్టు న్యాయవాది విష్ణుశంకర్ జైన్ (జ్ఞానవాపి కేసులో హిందువుల తరపు లాయర్) స్థానిక కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 1529లో ఆలయాన్ని కూల్చిన మొఘల్ చక్రవర్తి బాబర్.. ఇక్కడ షాహీ జామా మసీదును నిర్మించినట్లు కోర్టుకు వెల్లడించారు. మొఘలుల కాలం నాటి పుస్తకాలు 'బాబర్ నామా', 'ఆయినేఇఅక్బర్'ను ఆధారాలుగా చూపించారు. ఈ కేసులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, జామా మసీదు కమిటీ, సంభాల్ జిల్లా కలెక్టర్‌ను ప్రతివాదులుగా చేర్చారు. జామా మసీదు కమిటీ 1991 నాటి సుప్రీంకోర్టు మార్గదర్శకాలను, చట్టాన్ని ఉటంకిస్తూ.. 1947 నుంచి ప్రార్థన మందిరాలు ఎలా ఉన్నాయో.. అలాగే ఉంచాలనే ఆదేశాలున్నాయంటూ వాదనలను వినిపించింది. వాదోపవాదాలు, పూర్వాపరాలను పరిశీలించిన కోర్టు.. మంగళవారం అడ్వొకేట్ కమిషనర్ సమక్షంలో మసీదు సర్వేకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో.. జిల్లా యంత్రాంగం శనివారం నుంచే సర్వేకు ఏర్పాట్లు చేసింది. ఆదివారం ఉదయం 7 గంటల తర్వాత అధికారులు ఆ మసీదు వద్దే సర్వే ప్రారంభించారు. ఈలోగా సర్వేను నిలిపివేయాలని పెద్దఎత్తున నినాదాలు చేస్తూ పలువురు ఆందోళనకారులు మసీదు వెలుపల గుమికూడారు. అక్కడే బందోబస్తులో ఉన్న పోలీసులు వారిని చెదరగొట్టేందుకు ప్రయత్నించగా.. ఆందోళనకారులు రాళ్లు రువ్వారు. అక్కడే ఉన్న వాహనాలకు నిప్పుపెట్టారు. ''దుండగులు ఎయిర్ పిస్టళ్లతో కాల్పులు జరిపారు. రాళ్లదాడిలోనూ మరికొందరు పోలీసులు గాయపడ్డారు. మొత్తం 30 మంది పోలీసులకు గాయాలయ్యాయి'' అని సంభాల్ ఎస్పీ కృష్ణకుమార్ విష్ణోయ్ వెల్లడించారు. పోలీసులు లాఠీచార్జ్ చేసి, బాష్పవాయు గోళాలను, రబ్బర్ బుల్లెట్లను ప్రయోగించారని చెప్పారు. ఈ ఘటనల్లో ముగ్గురు ఆందోళనకారులు చనిపోయారని వివరించారు. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు మహిళలు సహా.. 10 మంది ఆందోళనకారులను అరెస్టు చేశారు. కాగా, ఈ ఘటనను ఎస్పీ చీఫ్ అఖిలేశ్ ఖండించారు. సర్వేను ఆయన తప్పుబట్టారు. బీజేపీ ప్రభుత్వం ఎన్నికల అక్రమాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఇలాంటి కుతంత్రాలకు పాల్పడుతోందని ఆరోపించారు.

# మాల.. మాదిగల కొట్లాట..
# మనువాదులకు కన్నుల పంట..!?

పోరాటాలు మాలలవి ప్రతిఫలాలు మాదిగలవా..!?
30 ఏళ్ల రాజకీయంలో మందకృష్ణ మాదిగ సాధించినదేంటి!?
అంబేద్కర్ అంటే మాలోడు, మాదిగోడు కాదు అంటూ ఈ సమాజానికి నూరి పోయడమా..!
అంబేద్కర్ ని ఏక వచనంతో పిలవడం ఏ సంస్కృతి నేర్పింది...!? ఏ చదువు బోధించింది అసలు నువ్వు ఏం చదువుకున్నావ్..!?
నాడు అంబేద్కర్ ఈ రాజకీయ పార్టీలు వద్దు నేనే ఒక రాజకీయ పార్టీ పెట్టిన రండి అంటే వెళ్ళని సమాజంలో మందకృష్ణ లాంటివాళ్ళు ఉన్నారా లేరా...!?
మాదిగలు ఇప్పుడు జై భీమ్ అంటారా!? జై జాంబ!? అని పిలుస్తరా..!?
మహాత్ముడు అని పిలిచిన నోటితోనే పాపాత్ముడు మావోడు కాదు అని మాదిగలు చేసే విష ప్రచారంపై "జయభేరి" కౌంటర్ విత్ కదారి శ్రీనివాస్ రాజకీయ సమగ్ర విశ్లేషణ...!



✍ కదారి శ్రీనివాస్
సీనియర్ జర్నలిస్ట్, పొలిటికల్ ఎనలిసిస్టు, కవి, రచయిత, గాయకుడు, సామాజిక ఉద్యమకారుడు

✍ జయభేరి, హైదరాబాద్ :

75 ఏళ్ల స్వతంత్ర భారతావనిలో మరొక్కసారి దళిత సమాజంలో అలజడి మొదలవుతుంది. ఒకవైపు మందకృష్ణ మాదిగ తన జాతికి అన్యాయం జరిగిందంటూ, మా ఎంగిలి కంచాన్ని మాలలు గుంజుకుంటున్నారనే ఒక తప్పుడు ఆరోపణలకు తెరలేపి విద్య, వైద్యం, ఉద్యోగ ఆర్థిక రంగాల్లో అన్యాయం జరుగుతుంది అంటూ మరొక మలిదశ ఉద్యమానికి శ్రీకారం చుట్టి తాను మాత్రం కావలసినంత లాభాన్ని పొందుకుంటున్నాడు. కానీ మందకృష్ణ కుట్రలో బలి అవుతున్న మాదిగ సోదరులు ఎంతోమంది వెనక ముందు ఏమీ తెలియకుండా, చరిత్ర చదవకుండా కేవలం మందకృష్ణ చెప్పిన మాటలనే వేదవాక్కులుగా పరిగణలోకి తీసుకొని మాలలపై తప్పుడు ప్రచారాలు విష ప్రచారాలు చేస్తున్నారు. కొట్లాటలకు ఆజ్యం పోస్తున్నారు. ఇంకొ వైపు మాలలు మాలల సింహగర్జనకు శ్రీకారం చుడుతున్నారు. ఊరు ఊరునా, వాడ వాడన నియోజకవర్గాలుగా మండలాలుగా ఉన్న మాలలందరినీ, మాల కుల సంఘాలన్నింటిని ఏకతాటిపై నడిపించేందుకు మాల జాతికి చెందిన ఎమ్మెల్యేలు ముందు వరుసలో నిలబడి విశ్రమించకుండా తమ జాతి ని కాపాడుకోవడానికి సర్వశక్తులు క్రోడీకరిస్తున్నారు. ముఖ్యంగా వీరిలో ఎమ్మెల్యే వివేక్ అలాగే మరొక ఎమ్మెల్యే నాగరాజు మాల జాతికి చెందిన పలు సంఘాలను ఏకీకృతం చేసే బాధ్యతను తమ భుజాలపై వేసుకున్నారు. మాల జాతి అంటే పోరాట స్ఫూర్తి నిదర్శనం, మల్ల యుద్ధ యోధులం, గ్రామానికి రక్షకులుగా ఉన్నాం, అంతెందుకు హరిశ్చంద్రుని కొనుక్కున్న జాతి మాది, మల్ల యుద్ధ శిక్షణలో గురు స్థానంలో ఉన్నాం, పీఠాధిపతులుగా ఉన్నాం, అగ్గిపెట్టెలో ఆరు గజాల చీరను చుట్టిన ఘన చరిత్ర మాది అంటూ తమ చరిత్రను ఈ సమాజానికి అందించే ప్రయత్నం జోరుగా ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. ఇక మాదిగలు మేము చెప్పులు కుట్టందే మీరేమీ తొడుక్కున్నారు!? డప్పు కొట్టందే మీకు శవం లేవదు!? పెయ్యను కోసి వాటి చర్మంతో చెప్పులు కుట్టినం, డప్పులు కొట్టి జాతిని జాగృతి పరిచిన ఘనత మాదే అంటూ అదే బానిస బతుకును ముందరే చేసుకుంటూ అందులో ఉన్న నాయకులు ఎదుగుతున్నారే తప్ప సామాజిక,రాజకీయ అణగారిన వర్గంతో పేదరికంతో బాధపడుతున్న ఏ మాదిగ కూడా ఆర్థికంగా, సామాజికంగా నిలబడదొక్కుకోవడంలేదు.

**30 ఏళ్ల రాజకీయ జీవితంలో మందకృష్ణ మాదిగ చేసిన అనర్థాలు ఎన్నో ఉన్నాయి... గ్రీన్ హంట్ పేరుతో బిజెపి పార్టీ అడవి బిడ్డలను చంపుతుంటే ఆ విషయాన్ని పక్కదోవ పట్టించి విశ్వరూప మహాసభ పెట్టి బిజెపిని సంకన ఎత్తుకుంది మందకృష్ణ కాదా...!? టిడిపి తో పొత్తు కుదుర్చుకొని వర్గీకరణతో ఏదో గొప్ప సాధించాం అనుకున్న ఆయన వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎన్ని సూట్ కేసులు అందుకున్నాడో ఎవరికీ తెలియదా..!? ఆనాటి ముఖ్యమంత్రి వైఎస్ కనుసన్నల్లో అనిగిమనిగి కూర్చున్న ఈ గొప్ప నాయకుడే కదా!? అంతెందుకు మందకృష్ణ మాదిగ సూటిగా ఒక సమాధానం చెప్పు... మలిదశ తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ రాజకీయ పార్టీగా మారక మునుపు ఇదే కేసీఆర్ అడుగుజాడల్లో నడిచిన అదే నీ భాషలో చెప్పాలి అంటే ఉద్యమంలో కేసీఆర్ వెంట నడిచినవారు మాదిగలు ఎంతమంది ఉన్నారో లెక్కబెట్టుకో..!? తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ఒక ఉపముఖ్యమంత్రి ఇస్తే కనీసం కాపాడుకోలేని స్థితి..! మీ గతి!? అంతెందుకు నువ్వు ఎమ్మెల్యేగా పోటీ చేసినవా!? చేసి నాకు గెలిచినవా? వార్డ్ మెంబర్ గా, గెలిచినవా !?ఎమ్మెల్సీగా గెలిచినవా!? ఇవేవీ జరగకుండా ఏకంగా భారత రాజ్యాంగ నిర్మాత, విజ్ఞాన ఘని, అంతటి మాహానుభావుడైన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ని ఏక వచనంతో పిలిచే అంత దమ్ము ధైర్యం నీకు ఎక్కడిది...!? ఎవ్వరిని చూసుకుని అంత పొగరు!? అంటే నీ వెనక ఉన్న మనువాద సామ్రాజ్యామా!? విశ్వరూప మహాసభలో భారత ప్రధానిగా నరేంద్ర మోడీ వచ్చినప్పుడు జబ్బు మీద చెయ్యి వేసి సరసగానే ఉప్పొంగిపోయి జై బిజెపి అంటూ బిజెపికి మద్దతు పలకలేద!? దళిత సమాజానికి పెద్ద ద్రోహివి నువ్వు కాదా!? రంగులు మార్చే ఉసర వెల్లివి..! దళిత సమాజం ఆర్థికంగా రాజకీయంగా సామాజికంగా విద్యాపరంగా ఉన్నతంగా ఎదగాలనే కదా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అన్ని కులాలకు అన్ని మతాలకు సమాన హక్కులు కల్పించి తమ జాతి కోసం విశ్రమించకుండా పోరాడిన చరిత్రకు సాక్ష్యం నువ్వు నేను లేమా!? రాజకీయ దురహంకారంతో రాజ్యాంగ పదవిలో కూర్చోవాలనే దురుద్దేశంతో ఒక జాతిని అడ్డుపెట్టుకొని ఆ జాతికి నేనే ఏదో తెచ్చి పెట్టానని గొప్పలు చెప్పకునే నీకు చరిత్రలో అత్యంత హీనమైన నాయకుడిగా పేరు సంపాదించుకోవడం తథ్యం...!? ఉన్నత చదువులు చదువుకున్నవారే ప్రపంచంలో భారత రాజ్యాంగాన్ని రాయాలి అని అంటే విజ్ఞాన ఘ, ప్రపంచం మేధావి, డా. బి ఆర్ అంబేద్కర్ గారు ఉన్నప్పుడు మేము రాయలేము అని చేతులెత్తేసిన సందర్భం... మీకు తెలియదేమో. అంటే చరిత్ర చదవాలి గదా... అలాంటి మహోన్నతమైన వ్యక్తిత్వం గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ని ఏక వచనంతో పిలవడం అది నీ కండ కావరం..!?**

అందుకనే మనువాద సామ్రాజ్యానికి అధిపతులుగా కొనసాగుతున్న వారు ఆర్ఎస్ఎస్ భావజాలంతో నడుస్తున్న బిజెపి పార్టీని గుండెలకు హత్తుకొని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన వారి కాళ్లకు నమస్కారం చేసిన హీనమైన సాంస్కృతికి ఆద్యం పోసిన చరిత్రకు నువ్వేమొదటి, కడపటి వాడివి. మందకృష్ణ మాదిగ ఊచ కోతల జరిగిన, కారంచేడు ఉద్యమం మరే ఉద్యమం తీసుకున్న, దళిత ఐక్య ఉద్యమాలలో మాదిగ జాతి నాయకుడు ఎవరు ముందు వరుసలో నిలబడి నాయకత్వం వహించారో చెప్పగలవా...!? అసలు రిజర్వేషన్లు అనే పదం పలకడానికి కూడా నీకు అర్హత లేదు!? దాని గురించి ఆ పోరాటం గురించి ఎలాంటి అవగాహన కూడా లేదు! కేవలం సామాజిక స్పృహ లేని మాదిగ జాతిని అడ్డుపెట్టుకొని స్వార్థ రాజకీయాలకు తెరలు లేపి సలిమంట వేసుకుంటూ నీ స్వార్థానికి బలి పశువులుగా మాదిగలను వాడుకుంటున్నావు.. ఇక మాల జాతి నాయకులు 30 ఏళ్లుగా మేము తప్పు చేశాం, ఏ రోజు కూడా ఎదిరించి మాట్లాడలేదు, అదే మేము తప్పు చేశామనే కోణంలో ఆలోచిస్తూ, మాల సింహ గర్జనకు డిసెంబర్ 1న సమయతమవుతున్నారు. మాల జాతి ఇప్పుడిప్పుడే తమ చరిత్రను తెలుసుకొని మాల జాతికి సంబంధించిన ఎందరో యువతి యువకులు తమ జాతి గురించి తమ జాతి చరిత్ర గురించి తెలుస్తుంటే చాలా ఉప్పొంగిపోతున్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కల్పించిన రాజ్యాంగపరమైన హక్కులను వాడుకుంటూ ఉన్నతమైన చదువులు చదివి వివిధ హోదాలో కొనసాగుతున్న వారిని చూపించి మందకృష్ణ మాదిగ మా హక్కులను.. మా ఉద్యోగాలను మొత్తం మాలలే గుంజుకుంటున్నారు అని చెప్పడం నిజంగా వెర్రితనం అవివేకం, మూర్ఖత్వం..! డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఒక మాట చెప్పాడు...మన పనులన్నీ హీనమైన పనులు మనం చేయొద్దు. కచ్చితంగా ప్రతి ఒక్కడు చదువుకోవాలి చదువుకోవాలి చదువుకోవాలి అంటూ ఆయన పదే పదే పలికిన మాట ఈ మాదిగ జాతికి ఎందుకు అర్థం కావట్లేదు...!? ఇంకా మేము ఆనాడు డప్పు కొట్టినం, ఆనాడు చెప్పులు కుట్టినం, అంటూ పాత చింతకాయ పచ్చడినే పదేపదే ముందరేసుకొని రుచి చూస్తున్న మాదిగ జాతికి ఉన్నత చదువులు చదువుకోవాలనే ఆలోచన ఎందుకు రావడం లేదు!?

**ఇక రాజకీయ పార్టీలు అన్నీ మాల మాదిగల పోరాటాన్ని ఉద్యమాన్ని ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. ఎందుకంటే ఇద్దరూ విడిపోతే దళిత జాతిని నాశనం చేయడం మనువాద సంస్కృతి కలిగిన రాజకీయ పార్టీలకు సులువు అయిపోతుంది కదా. దక్షిణ భారతదేశంలో బిఎస్పి పార్టీని స్థాపించాలనే వస్తున్న తరుణంలో టిఆర్ఎస్ కు రాజీనామా చేసిన ఒక మాదిగ ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్పీలో చేరి ఎమ్మెల్యేగా పోటీ చేస్తే కనీసం ఓట్లు పడకుండా చేసిన ఘనత మాదిగ జాతిది కాదా.... స్వార్థ అవకాశవాద రాజకీయాలకు తెరలు లేపిన మందకృష్ణ మాదిగ జాతికి తానేదో చేశాడని చెప్పకుంటూ కొంతమందిని పోగేసుకొని తమకు ఇష్టం వచ్చినట్టుగా మాల సమాజంపై విషం కక్కుతున్న ఈ తరుణంలో తెలంగాణ ఆంధ్రప్రదేశ్ లో ఉన్న మాలలు అందరూ ఏకమై ఉద్యమిస్తే మాదిగలకు కనీసం ఉన్న హక్కులు కూడా లేకుండా పోతాయి అనేది వాస్తవం కాదా...మందకృష్ణ మాదిగ పదేపదే మేము ఎక్కువ జనాభా ఉన్నాం మాకు ఎక్కువ వాటా రావాలి అని చెబుతున్న సందర్భంలో తెలంగాణ రాష్ట్రంలో ఎంత మంది మాదిగలు ఉన్నారు ఎంతమంది మాలలు ఉన్నారు కుల గణన వచ్చిన తర్వాత మాట్లాడాల్సిన విషయం కదా... తొందరపడి కోయిల ముందే కూస్తుంది!? మందకృష్ణ రాజ్యాంగపు నీడలో ఉండి అదే కొమ్మలు నరుక్కోవాలని ఎందుకు చూస్తున్నాడు!? మాదిగ సోదరులు ఒకసారి ఆలోచన చేయాలి. మనువాదపు చలిమంటలో చలికాగుతున్న స్వార్థ రాజకీయ నాయకుడు మందకృష్ణ మాదిగ. కేవలం మాదిగ అనే పదాన్ని ఇవ్వాలా 30 సంవత్సరాల నుంచి అన్ని రాజకీయ పార్టీలకు రుచి చూపించిన ప్రయత్నంలో సఫలీకృతుడు అయ్యాడు. కానీ ఆ జాతిలో అణగారిన బిడ్డలకు మాత్రం ఆర్థిక సామాజిక విద్య వైద్యాన్ని మాత్రం అందించలేకపోయాడు ప్రజలను నడిపించేవాడు కావాలి గానీ ప్రజలను మభ్యపెట్టి వారిని వారి ఆలోచనలని పక్కదోవ పట్టించే నాయకుడు ఈ సమాజానికి అవసరమా!? ఈ జాతికే అవసరమా!? నోటికి ఎంత వస్తే అంత మాట్లాడే మందకృష్ణ మాదిగ ప్రపంచ దేశం మొత్తం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను కీర్తిస్తూ ప్రతి గ్రామంలో ఆయన విగ్రహాన్ని పెట్టిన ఘనత ఉన్న అలాంటి మహోన్నతమైన ఉన్నతమైన విద్యాధనికుడైన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ని ఏక వచనంతో పిలవడం ఎంత అమానుషం.. ఎంత అవమానం..**

**ఓ దళిత సమాజమా..!**

ఒకసారి ఆలోచించు మాల మాదిగల మధ్య కొట్లాట మనువాదులకు ఒక పండగ వాతావరణాన్ని కలిగిస్తోంది. ఎవడు గెలిస్తే వానితోనే రాజకీయం చేద్దామనుకొని నక్కినక్కి చూస్తున్న మనువాద రాజకీయ పార్టీల కుట్రలను పసిగట్టాలి... డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశించిన సమాజం ఇది కాదు... ఇవాళ ఆయననే దోషిగా నిలబెడుతూ అంబేద్కర్ అంటే మాలవాడు అని వేరు చేసే మాదిగ జాతిలో విష ప్రచారాన్ని నింపే దళిత ద్రోహులను ఎప్పటికప్పటికీ గుర్తించి వారిని నిలువరించకపోతే దళిత సమాజం పూర్తిగా నాశనమైపోవడానికి అంత సమయం పట్టదు.. రాజకీయ కుట్రలో మనువాదుల ఆలోచనల్లో దళిత జాతిని విడగొట్టడమే దళితులను ఆగం చేయడమే.. ఏది ఏమైనా అంబేద్కర్ లాంటి మహానుభావుడిని విద్య వేత్తని భారత రాజ్యాంగ నిర్మాతను ఆయన రాసిన రాజ్యాంగం నీడలో ఉంటూ ఆయననే దోషిగా నిలబెట్టే ఇలాంటి నీచమైన రాజకీయ నాయకులకు తగిన బుద్ధి చెప్పాలి.. రాజ్యాంగాన్ని మార్చేస్తామని చెప్పే మనువాదుల నోళ్లకు తాళాలు వెయ్యాలి.. దళితుల్లో ఉన్నతమైన చదువులు చదివి మాల మాదిగ జాతిలో ఉన్న వాళ్ళు ప్రతి ఒక్కరు ఆలోచించాలి... సోషల్ మీడియాలో పిచ్చి పిచ్చి రాతలు రాసి అర్థం తెలియకుండా చరిత్ర తెలియకుండా ఒక నాయకుడికి వత్తాసు పలుకుతూ ఊగిపోయే సోదరులందరికీ చెబుతున్నా.. చరిత్రను చదవండి అంబేద్కర్ను చదవండి మీ జీవితంలో ఎదగడానికి చదువుకోండి.. వాస్తవం తెలుసుకోండి ఇలాంటి మనువాద విషపు కౌగిలిలో ఉంటూ దళిత సమాజాన్ని మభ్యపెడుతూ పబ్బం గడుపుతున్న ఏ నాయకుడైన ఉంటే ప్రజలు అలాంటి వారిని గుర్తించి ఖచ్చితంగా వారిని ఈ సమాజం నుండి వెలివేయాలి రాజకీయ సమాధి చేయాలి.. అంతేకానీ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ లాంటి ఉన్నతమైన వ్యక్తిని ఏక వచనంతో పిలవడం మాటికి నేరం దేశద్రోహం..

## పిహెచ్‌డీ ఇవ్వాలి

ఇప్పటికే విడుదలైన దళిత బంధు డబ్బులను వాళ్లకు అందించాలని కోరారు. లగిచర్లలో ఫార్మాసిటీ కాదు ఇండస్ట్రియల్ కారిడార్ అంటూ ఇప్పుడు సీఎం మాట మార్చాడని తెలిపారు. జులై 19, 2024 నాడు ఫార్మసిటీ అంటూ ఈ ప్రభుత్వమే గెజిట్ ఇచ్చింది...ఇప్పుడు నీవు ఇచ్చిన గెజిట్ పైనే అబద్ధాలు ఆడుతున్నావా అని ప్రశ్నించారు. ప్రజలకు క్షమాపణ చెప్పి ఆ గెజిట్ వెనక్కి తీసుకున్నట్టు రేవంత్ రెడ్డి ప్రకటించాలని డిమాండ్ చేశారు. దాన్ని రద్దుచేసి కొత్త గెజిట్ ఇస్తేనే ప్రజలు నమ్ముతారని తెలిపారు. పచ్చని పంటలు పండే భూములను తొండలు గుడ్డు పెట్టని భూములుగా రేవంత్ రెడ్డి ప్రచారం చేస్తున్నాడని ఆరోపించారు. కాళేశ్వరం కూలిపోయిందని చెబుతున్న నీవు 20 టీఎంసీల నీటిని అదే ప్రాజెక్టు నుంచి హైదరాబాద్ కు ఎలా తీసుకెళ్తావు? అని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని 39 కాంపోనెంట్లలో మేడిగడ్డ అనేది ఒక కాంపోనెంట్. అందులో రెండు ఫిల్లర్లకు మాత్రమే డామేజ్ జరిగిందని తెలిపారు. గోరంతలు కొండంతలుగా గోబెల్ ప్రచారం చేశారని విమర్శించారు. ఇప్పుడు పారే నీళ్లన్నీ కాళేశ్వరం ప్రాజెక్టులో భాగం కాదా? అని ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మోసం చేశావు.... ఇప్పుడు అధికారంలో ఉండి కూడా మోసం చేస్తావా? అన్నారు. కాళేశ్వరం కూలిపోతే మూసికి నీళ్ల ఎలా పోతాయని ప్రశ్నించారు. మల్లన్న సాగర్, కొండ పోచమ్మ సాగర్, రంగనాయక సాగర్ కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమని స్పష్టం చేశారు. మిషన్ భగీరథ పై సాక్షాత్తు ప్రధానమంత్రి లోకసభలో మెచ్చుకున్నారని తెలిపారు. మిషన్ భగీరథ గతంలో ఫెయిల్ అయిందని చెప్పిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు అదే మిషన్ భగీరథ ఇంజనీర్లతో మీటింగ్ పెట్టి మాట్లాడాడని తెలిపారు. మిషన్ భగీరథ ప్రాజెక్టు లాగానే హైదరాబాద్ కు 20 tmc నీళ్లు తరలించాలని మాట్లాడుతున్నాడని తెలిపారు. మహాలక్ష్మి బకాయిలు కూడా చెల్లించాలని కోరారు. హుజురాబాద్ లో దళిత సోదరులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తి వేసి దళిత బంధు అకౌంట్ ల ఫ్రీజింగ్ ఎత్తివేసి వారికి డబ్బులు విడుదల చేయాలని కోరారు. డిసెంబర్ 9 నుంచి జరిగే అసెంబ్లీలో దళితుల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు.

## విద్యార్థులకు రూ.6,500 కోట్లు

చిన్నపిల్లల చిక్కీ డబ్బులు సైతం ఎగ్గొట్టారని విమర్శించారు. గుడ్లు, చిక్కీలు మొదలుకొని ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల వరకూ.. మీరు తమ నెత్తిన పెట్టి పోయిన బకాయిలు అక్షరాలా రూ. 6,500 కోట్లు అని వ్యాఖ్యానించారు. ఫీజు మొత్తం కడతానని చేతులెత్తేసిన చెత్త పాలన మీదని ఫైర్ అయ్యారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని మార్చి విద్యార్థుల భవిష్యత్తుతో ఫుట్ బాల్ ఆడుకుంది మీరని ఆరోపించారు.
'అధికారంలో ఉన్నప్పుడు బాధ్యతారాహిత్యంగా ఉండి ప్రతిపక్షంలోకి రాగానే విలువలు వల్లించడం మీకే చెల్లింది. విద్యాదీవెన, వసతి దీవెన పేరుతో రూ.3500 కోట్లు బకాయిలు పెట్టి మోసం చేసిన కారణంగానే.. సర్టిఫికెట్లు రాక లక్షలమంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. నేను యువగళం పాదయాత్ర చేసేటప్పుడే మీ నిర్వాకాన్ని విద్యార్థులు నా దృష్టికి తెచ్చారు. ఇకపై ఫీజు రీఎంబర్స్‌మెంట్ సొమ్మును నేరుగా కళాశాలలకు చెల్లించేలా ఇటీవలే నిర్ణయం కూడా తీసుకున్నాం' అని లోకేష్ ట్వీట్ చేశారు. 'అర్ధరాత్రి ఆత్మలతో మాట్లాడి ఉదయం నిర్ణయాలు తీసుకుని గత ఐదేళ్లలో విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించారు. మీ అనాలోచిత, అవినీతి విధానాల కారణంగా గత ఐదేళ్లలో రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్లలో 4 లక్షలమంది విద్యార్థులు తగ్గిపోయిన విషయం వాస్తవం కాదా? ఉపాధ్యాయులు, విద్యార్థులను సిద్ధం చెయ్యకుండానే సీబీఎస్ఈ పరీక్షా విధానం తీసుకొచ్చారు. మేం అధికారంలోకి వచ్చాక సీబీఎస్ఈ పరీక్షా విధానంలో నిర్వహించిన పరీక్షల్లో 90 శాతం మంది ఫెయిలయ్యారు. నీ నిర్ణయాలు బ్లైండ్‌గా ఫాలో అయితే.. ఆ పిల్లలు అంతా బోర్డు పరీక్షల్లో తప్పి డిప్రెషన్లోకి వెళ్లేవారు. ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యం పెంచకుండా, టోఫెల్, ఐబీ శిక్షణ ఇచ్చేవారు లేకపోయినా అమలు చేశామని డబ్బా కొట్టుకోవడం. ఇలా ఒక్కటేంటి విద్యా వ్యవస్థను నాశనం చేసిన పాపం మీదే జగన్' అని లోకేష్ విమర్శించారు. 'నాడు నేడు అంటూ పబ్లిసిటీ పీక్‌కు తీసుకెళ్లారు. కానీ విషయం వీక్ అని తేలింది. నా క్షేత్రస్థాయి పర్యటనల్లో కనీసం పిల్లలు కూర్చోడానికి బల్లలు, తాగునీరు, టాయ్ లెట్లు లేని పాఠశాలలు దర్శనమిస్తున్నాయి. ఇక ట్యాబులు ఇంటికి ఇవ్వడం వలన జరుగుతున్న అనర్థాలను మీరు నేరుగా తల్లితండ్రులను అడిగి తెలుసుకోవచ్చు.

# వీరశైవుల అభ్యున్నతికి తోడ్పడుతా..

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**జయభేరి, కాప్రా :**


కాప్రా వీర శైవ సమాజం అధ్యక్షులు ప్యాట జ్ఞానేశ్వర్, గౌరవ అధ్యక్షులు యావపురం విశ్వనాథం ఆధ్వర్యంలో కార్తీక మాస వనభోజన సమారాధన అత్యంత భక్తిశ్రద్ధలతో ఆదివారం వాసవి శివానగర్లోని వాసవి కన్యకా పరమేశ్వరి శివాలయంలో నిర్వహించారు. ఉదయం ఆలయంలో పూజలు, శివాభిషేకం నిర్వహించి సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా పిల్లలతో భక్తి పాటలు, మ్యాజిక్ షో, భజన కార్యక్రమం నిర్వహించారు, కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అతిథులుగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరయ్యారు, సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీరశైవుల అభ్యున్నతికి తోడ్పడతానన్నారు, చదువుకునే విద్యార్థినీ విద్యార్థులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు, వీరశైవులకు సామాజిక భవనం నిర్మించేందుకు సహకరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలోమాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని మణిపాల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ రాముల యాదవ్, చర్లపల్లి కాలనీల సమైక్య అధ్యక్షుడు ఎంపల్లి పద్మా రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గడ్డం ప్రసాద్, కంటెస్టెంట్ కార్పొరేటర్ మెమూరి మహేష్ గౌడ్, బిజెపి నాయకులు మర్రి మోహన్ రెడ్డి,రమేష్ యాదవ్, సహస్ర లింగేశ్వర ఆలయం అభివృద్ధి కమిటీ మెంబర్ శివ, ఎంఈఓ శశి కుమార్, కొప్పునూరు రాజేష్, సమాజం ప్రధాన కార్యదర్శి గంగా ఈశ్వరయ్య, కత్తి శివానంద్, మస్కరి శివ, జంగం శంభు లింగం, సిద్దేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



## వెన్నెల గద్దర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నాయకులు

**జయభేరి, మేడ్చల్ :**

తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక చైర్పర్సన్ గా నూతనంగా నియామకమైన డాక్టర్ జీవి వెన్నెల గద్దర్ ను గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ నేతలు శనివారం ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక చైర్పర్సన్ గా డా॥ వెన్నెలను నియమించిన సందర్భంగా ఆమెను కలిసి శాలువతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక చైర్పర్సన్ గా నియామకం అయిన డాక్టర్ జీవీ వెన్నెల గద్దర్ కు శుభాకాంక్షలు తెలిపారు. ఈనెల 25న తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక చైర్పర్సన్ గా వెన్నెల బాధ్యతలను చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి గద్దర్ అభిమానులు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యల హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అంతకుముందు కాంగ్రెస్ నేతలు ప్రజా యుద్ధ నౌక, ప్రజా గాయకులు గద్దర్ సమాధి ని సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గుండ్లపోచంపల్లి కాంగ్రెస్ నేతలు మారేపల్లి సుధాకర్, కుండా భానుచందర్, డాక్టర్ ప్రభాకర్, బొమ్మల మైసయ్య తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి బ్రహ్మోత్సవాలు

**జయభేరి, నవంబర్ 24:**

శామీర్ పేట్ మండలం అలియాబాద్ లోని శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఆలయంలో పూజారులు స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. ఇక స్వామి వారి బ్రహ్మోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారిని దర్శించుకునీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి బ్రహ్మోత్సవాలను నిర్వహించడం పట్ల ఎమ్మెల్యే మల్లారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు, ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సరసం మోహన్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి అనితలాలయ్య, మాజీ సర్పంచ్ గుర్కా కుమార్ యాదవ్, ఆలయ ధర్మకర్త పల్లె సీతారాములు గౌడ్,సీనియర్ నాయకులు తాళ్ల జగదీష్ గౌడ్, వంగ వెంకట్ రెడ్డి, నరసింహారెడ్డి.

# ఇంటింటి సర్వేలో డేటా ఎంట్రీ కీలకమైంది

- కుటుంబ సర్వే పై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్
- వలస వెళ్లిన వారి వివరాలు ఫోన్ కాల్ ద్వారా సేకరించాలి
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



**జయభేరి, నవంబర్ 24:**

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చివరి దశకు చేరుకుంటుందని, అయితే సర్వే డేటా ఎంట్రీ చాలా కీలకమైందని, ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వవద్దని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం ఉదయం ఆయన జార్ఖండ్ రాజధాని రాంచి నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే డేటా ఎంట్రీ లో నాణ్యత చాలా ముఖ్యమైందని, ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి కేంద్రీకరించిందని తెలిపారు. సర్వే దశలో పట్టణ ప్రాంతాల్లో డోర్ లాక్, ఇంటి వద్ద అందుబాటులో లేకపోవడం వంటి కొన్ని సమస్యలు తలెత్తేయనీ, కాగా వారికి ఫోన్ కాల్ చేసి సర్వే గురించి తెలియజేయడం ద్వారా ఆ వివరాలను క్రమ బద్ధకరించుకోవాలని, వారిని అందుబాటులో ఉండమని కోరాలని ఆదేశించారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో వలసలు మొదలైన వారి వివరాలను జాగ్రత్తగా క్రమ బద్దరీకరించుకోవాలని సూచించారు. కొన్ని వసతి గృహాల్లో, రెసిడెన్షియల్ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కేసులు నమోదవుతున్నాయని, ఈ పాఠశాలలో ఆహారం, పరిశుభ్రత పై ప్రధానంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రుల దృష్టికి వచ్చిందని అన్నారు. దీనిపై అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫుడ్ పాయిజనింగ్ వంటి సమస్యలు తలెత్తకూడదనే మెస్, కాస్మోటిక్స్ చార్జీలను ప్రభుత్వం పెంచిందని భట్టి విక్రమార్క తెలిపారు. ఫుడ్ పాయిజన్, అపరిశుభ్రత వంటి అంశాలకు తావు లేకుండా కార్యాచరణ ప్రణాళిక రూపొందించడానికి సంబంధిత అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టరేట్ నుండి అదనపు కలెక్టర్ రాధిక గుప్త పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు ఇల్లు కూలి ఇద్దరికీ గాయాలు



**జయభేరి, గజ్వేల్, నవంబర్ 24 :**

అకస్మాత్తుగా ఇంటి కప్పు, గోడలు కూలి నిద్రిస్తున్న భార్య భర్తలకు గాయాలైనా ఘటన గజ్వేల్ మండలం అహ్మదీపూర్ చోటు చేసుకుంది.వివరాల్లోకి వెళ్తే గ్రామానికీ చెందిన చాకలి బక్కవ్వ, మహిపాల్ అనే ఇద్దరు భార్యాభర్తలు శనివారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో ఒంటి గంట ప్రాంతంలో అకస్మాత్తుగా పైన ఉన్న ఇంటి కప్పు, గోడలు కూలి వారి మీద పడ్డాయి. దీంతో పెద్ద చప్పుడు రావడంతో చుట్టుపక్కల ఉన్నవారు నిద్రలేచి వారిని ప్రమాదం నుండి కాపాడారు. దాదాపు 15 నిముషాలు వారు ఆ మట్టిలోనే కూరుకుపోయారు. పిల్లలు వేరే రూమ్ లో నిద్ర పోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.. భార్య భర్తలకు ఇరువురికి గాయాలు అయ్యాయి. వృత్తిరీత్యా వారు ముంబైలో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ దసరా పండక్కి స్వంత ఇంటికి రావడంతో పాతయింట్లో నిద్రపోయారు.

# లాల్ గడి మలక్ పేట్ ఘనంగా జరిగిన అయ్యప్ప మహా పడి పూజ

- పెద్ద సంఖ్యలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు, భక్తులు, గ్రామస్తులు
- భజన సంకీర్తనలతో అయ్యప్పను స్మరించుకున్న భక్తులు



**జయభేరి, నవంబర్ 24:**

మేడ్చల్ జిల్లా లాల్ గడి మలక్ పేట్ లో హరిహర సుతుడు అయ్యప్ప స్వామి మహాపడి పూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. సత్యం గురుస్వామి, రాజు గురుస్వామి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన సాల్లూరి దశరథ గురుస్వామి నిర్వహించిన ఈ పడిపూజకు సన్నిధాన స్వాములు, అయ్యప్ప స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అయ్యప్ప స్వామికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ఇక మదన్ మోహన్ భజన మండలి ఆధ్వర్యంలో స్వామిని స్మరిస్తూ భజన కీర్తనలతో పాటలు పాడారు. 18 పడి మెట్లకు పూజలు నిర్వహించిన అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను భక్తులకు అందచేసారు. పూజకు విచ్చేసిన వారికి అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, భక్తులు, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు , మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శంకర్ గౌడ్, మాజీ సర్పంచ్ చీదు వనజ శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

కొల్గుర్ మాజీ ఎంపీటీసీ జ్యోతి స్వామి




**జయభేరి, గజ్వేల్, నవంబర్ 24 :**

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు కొల్లూరు గ్రామ టీం సెలెక్ట్ కావడం సంతోషకరమని కొల్గుర్ మాజీ ఎంపీటీసీ జ్యోతి స్వామి అన్నారు. ఈ సందర్భంగా ఇష మహోత్సవ డిస్ట్రిక్ట్ 1St ప్లేస్ వచ్చిన కొల్గుర్ వాలీబాల్ టీం, కు గ్రామ మాజీ ఎంపీటీసీ జ్యోతి స్వామి వారికి శాలువాతో సన్మానం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోల్గూర్ గ్రామానికి చెందిన యువకులు గెలుపుపోదడం మరియు నెక్స్ట్ డిసెంబర్ 01122024 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు కొల్లూరు గ్రామ టీం సెలెక్ట్ కావడం జరిగిందన్నారు.ఫస్ట్ ప్రైజ్ అండ్ మనీ ప్రైస్ కూడా గెలుచుకోవడం జరిగింది రాష్ట్రస్థాయిలో గెలిచిన వారు నేషనల్ స్థాయికి తీసుకువెళ్లడం జరుగుతుంది నేషనల్ స్థాయిలో గెలిచిన వారికి 5 లక్షల మనీప్రైస్ ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారిలో మాజీ ఉపసర్పంచ్ గొల్ల స్వామి, సత్తయ్య గౌడ్, బైరయ్య, రాములు, పురం ఆంజనేయులు, నరేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు

## క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ ప్రారంభం

గోన మైసమ్మ జాతర వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి



**జయభేరి, నవంబర్ 24:**

గ్రామీణ ప్రాంతాల్లోనీ యువత క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి సూచించారు. శామీర్ పేట మండలం తుర్కపల్లి గ్రామంలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ ను టాస్ వేసి ప్రారంభించారు. అదేవిధంగా గ్రామంలో జరుగుతున్న గోన మైసమ్మ జాతర వేడుకల్లో ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అందరినీ చల్లగా చూడాలని అమ్మవారిని వేడుకున్నట్లు ఆయన వెల్లడించారు,ఈ కార్యక్రమం లో క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

- పూర్వ విద్యార్థులం మేము అపూర్వ విద్యార్థులము
- ఒక చెట్టుకు పూసిన పువ్వులం కాదు ఒక తల్లి కడుపున పుట్టిన బిడ్డలము కాదు.. అయినా ఆత్మీయనురాగాలను పంచుకున్న మా బంధం స్నేహబంధం
- ఇన్ని సంవత్సరాలకు గెట్ టుగెదర్ కార్యక్రమం నిర్వహించుకోవడం సంతోషంగా ఉంది
- 2000-01 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పడమటి పల్లి పూర్వ విద్యార్థులు



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మండల కేంద్రంలోని పడమటిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 200001 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు (మనం మనబడి ఫౌండేషన్ సభ్యులు) ఆదివారం పడమటిపల్లి హైస్కూల్లో ఆవరణలో ఆత్మీయ సమ్మేళనాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా అప్పట్లో విద్యార్థులకు బోధన చేసిన ఉపాధ్యాయులు నారాయణ రెడ్డి, వెంకట్ రెడ్డి, తిరుపతిరావు, విష్ణువర్ధన్ రెడ్డి,కృష్ణమూర్తి, సురేష్ బాబు,సుందర్ రాజ్ లను విద్యార్థులు పాదాభివందనం చేసి, శాలువలతో పూలతో మెమొంటోలతో సత్కరించారు. 24 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు ఒకే చోట కలవడం చాలా సంతోషంగా ఉందని, అప్పటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమతో పాటు చదువుకొని మృతి చెందిన తమ మిత్రులకు,ఉపాధ్యాయులకు ఘనంగా నివాళి అర్పించి, శ్రద్ధాంజలి ఘటించారు. ఉదయం నుండి సాయంత్రం వరకు తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని, ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు.ఆనాటి విద్యార్థులు కలుసుకొని, మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఉద్యోగాలు, వ్యాపారాలు, వ్యవసాయంలో స్థిరపడిన ఆనాటి పదో తరగతి విద్యార్థులు ఒకరినొకరు పరిచయం చేసుకొని పాత జ్ఞాపకాలను గుర్తు చేస్కుంటూ వారు చేస్తున్న వృత్తి, ఉద్యోగాలు తెలుసుకొని, వారికి పాఠాలు నేర్పిన గురువులను సత్కరించి, వారిపట్ల గౌరవాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో గుర్తుండే తీపి జ్ఞాపకాలు చిన్నతనంలోనే ఉంటాయని,ఇక్కడ చదవిన విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించి అత్యున్నత స్థానాల్లో స్థిరపడ్డారని, ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలని, తల్లి,దండ్రులను అత్త,మామలను గౌరవించి వారి ఆశీస్సులను ఎప్పుడు పొందాలని అన్నారు. ఈ సందర్భంగా పడమటిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధి కొరకు పూర్వ విద్యార్థులందరూ కలిసి 50వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ వేడుకల్లో మస్న శివకుమార్, చిరంజీవి, డి పి యాదయ్య,సైదులు,తిరుపతిరెడ్డి, పోలే విష్ణు, నేనావత్ రవి, లలిత, సరిత, రాణి, శ్రీలత, కల్పన విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ జన్మదినం పురస్కరించుకుని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ని మర్యాద పూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు.


**జయభేరి, దేవరకొండ**

## సుభాష్ చంద్రబోస్ విగ్రహావిష్కరణ




**జయభేరి, గజ్వేల్, నవంబర్ 24 :**

సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణ కేంద్రంలో హైందవ సోదరుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని ఆదివారం అట్టహాసంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, మాజీ ఎఫ్ డి సి చైర్మన్ ప్రతాప్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ భాస్కర్, డాక్టర్ నరేష్ బాబు, మాట్లాడుతూ హైందవ సోదరుల ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని నేతాజీ సుభాష్ చంద్రబోస్ భారతదేశ స్వాతంత్ర పోరాటంలో ముఖ్య భూమిక పోషించాడని దేశభక్తికి ప్రతిరూపం సుభాష్ చంద్రబోస్ అని వారి అడుగుజాడల్లో యువత పయనించాలని గజ్వేల్ లో మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయడం శుభ సూచికమని సుభాష్ చంద్రబోస్ విగ్రహ ఏర్పాటులో ముఖ్య పాత్ర పోషించిన మిన్న కంటి ప్రసాద్ హైందవ సోదరులను అభినందించారు అనంతరం అందరి సమక్షంలో సుభాష్ చంద్రబోస్ విగ్రహ ప్రాంతాన్ని సుభాష్ చంద్రబోస్ చౌరస్తా అని నామకరణం చేశారు, ఈ కార్యక్రమంలో రాజశేఖర శర్మ,మున్సిపల్ పాలకవర్గం, మాజీ కౌన్సిలర్లు, హైందవ సోదరులు, మాజీ కౌన్సిలర్ సుభాష్ చంద్రబోస్, బుక్క రమేష్, మనోహర్ యాదవ్, సయ్యద్ మతిన్, సర్దార్ ఖాన్, ఫారుక్ జానీ,నక్క రాములు గౌడ్,ఎల్లు రామ్ రెడ్డి, నంగునూరి సత్యనారాయణ, ఉప్పల ప్రవీణ్,ఉప్పల మధు, ఎన్ సి సంతోష్, బాల కుమార్ సుంకరి, నాయిని సందీప్, గోలి సంతోష్, దేశబోయిన నర్సింలు, లయన్స్ క్లబ్ సభ్యులు, పెద్ద ఎత్తున గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పుర ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు, యువజన సంఘాలు, యువకులు, అన్ని పార్టీల ప్రముఖులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




# మూడో పాట వచ్చేస్తోంది

ఆడియన్స్ ఆతృతగా ఎదురుచూస్తున్న సినిమాల్లో రామ్‌చరణ్ 'గేమ్ చేంజర్' ముందు వరుసలో ఉంటుంది. దాదాపు మూడేళ్లు నిర్మాణం జరుపుకున్న ఈ భారీ పానిండియా చిత్రం జనవరి 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. శంకర్ దర్శకత్వంలో దిల్‌రాజు నిర్మిస్తున్న ఈ చిత్రం తమిళ వెర్షన్‌ని ఆదిత్యరామ్ మూవీస్ సంస్థలు విడుదల చేస్తుండగా, హిందీలో ఏఏ ఫిల్మ్స్ అనిల్ తడానీ రిలీజ్ చేస్తున్నారు. ప్రస్తుతం దర్శకుడు శంకర్ ఈ సినిమాకు తుదిమెరుగులు దిద్దుతున్నారు. ఈ సినిమా మ్యూజికల్ ప్రమోషన్ ఇప్పటికే మొదలైన విషయం తెలిసిందే. థమన్ సంగీత దర్శకత్వంలో ఇప్పటికే విడుదలైన రెండు పాటలూ చార్ట్ బస్టర్స్‌గా నిలిచాయి. ఈ నెల 28న మూడో పాటను మేకర్స్ విడుదల చేయనున్నారు. న్యూజిలాండ్‌లో రామ్‌చరణ్, కియారా అద్వానీలపై చిత్రీకరించిన ఈ మెలోడీ సాంగ్ సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ సందర్భంగా ఈ పాటకు సంబంధించిన పోస్టర్‌ని కూడా విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో రామ్‌చరణ్, కియారా అద్వానీ కూల్‌గా కనిపిస్తున్నారు. డిసెంబర్ 21న అమెరికాలో ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించనున్న విషయం తెలిసిందే. అంజలి మరో కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో శ్రీకాంత్, ఎస్.జె.సూర్య, సునీల్ తదితరులు ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కథ: కార్తీక్ సుబ్బరాజు, మాటలు: సాయిమాధవ్ బుర్రా, కెమెరా: ఎస్.తిరుణ్ణావుక్కరసు, సహనిర్మాత: హర్షిత్.



# నేనంటే తనకు అస్సలు పడదు

అందం, అభినయ సామర్థ్యం రెండూ దండిగా ఉన్న కథానాయిక అషికా రంగనాథ్. కలిసొచ్చే అదృష్టం కోసం కళ్లలో దీపాలు పెట్టుకొని మరీ ఎదురు చూస్తున్నది ఈ కన్నడ కస్తూరి. సిద్ధార్థ్‌కి జోడీగా ఈ అందాలభామ నటించిన 'మిస్ యు' సినిమా ఈ నెల 29న విడుదల కానుంది. ఎన్.రాజశేఖర్ దర్శకత్వంలో సామ్యూల్ నిర్మించిన ఈ చిత్రంపై అషికా ఎంతో ఆశ పెట్టుకున్నది. ఇటీవల ఈ సినిమా గురించి తను మాట్లాడుతూ 'ఇందులో నా పేరు సుబ్బులక్ష్మి. సిద్ధార్థ్ పేరు వాసుదేవ్. నేనంటే తనకు అస్సలు పడదు. కానీ.. అనుకోకుండా నా ప్రేమలో పడిపోతాడు. కారణం ఏంటో తెరపైనే చూడాలి.' అంటూ చెప్పుకొచ్చింది అషికా రంగనాథ్. ఇంకా మాట్లాడుతూ 'నేను ఎలాంటి పాత్రలనైతే ఇష్టపడతానో.. అలాంటి పాత్ర సుబ్బులక్ష్మి. తను ఇన్నోసెంట్. పక్కా ట్రెడిషనల్. ఓ విధంగా ఇది సుబ్బులక్ష్మి కథే. ఇంతటి మంచి పాత్ర ఇచ్చిన దర్శకుడు రాజశేఖర్‌కీ, హీరో సిద్ధార్థ్‌కీ థ్యాంక్స్ చెప్పుకుంటున్నా' అని తెలిపింది అషికా.





# పుష్ప 2 ది రూల్.. కిస్సిక్ ఫుల్ సాంగ్

టాలీవుడ్ స్టార్ యాక్టర్ అల్లు అర్జున్ సుకుమార్ కాంబోలో వస్తోన్న ఫ్రాంఛైజీ ప్రాజెక్ట్ పుష్ప 2 ది రూల్. డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే ప్రమోషన్స్‌తో ఫుల్ బిజీగా ఉంది టీం. ముందుగా అందించిన అప్‌డేట్ ప్రకారం కిస్సిక్ లిరికల్ సాంగ్‌ను లాంచ్ చేశారు. రాక్ స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ కంపోజ్ చేసిన ఈ పాటలో అల్లు అర్జున్, శ్రీలీల స్టైలిష్ ఊరమాస్ స్టెప్పులతో హోరెత్తిస్తున్నారు. కిస్సిక్ సాంగ్ సినిమాకే హైలెట్‌గా నిలువనుందనడంలో ఎలాంటి సందేహం లేదు. లీల, బన్నీ స్టైలిష్ కలర్‌ఫుల్ డ్యాన్స్‌తో థియేటర్లు దద్దరిల్లిపోవడం గ్యారంటీ అని విజువల్స్ చెప్పకనే చెబుతున్నాయి. చంద్రబోస్ రాసిన ఈ పాటను Sublahshini పాడింది. సీక్వెల్‌లో ఫహద్ ఫాసిల్, జగదీష్ ప్రతాప్ బండారి, జగపతిబాబు, ప్రకాశ్ రాజ్, సునీల్, అనసూయ భరద్వాజ్, రావు రమేశ్, ధనంజయ, షణ్ముఖ్, అజయ్, శ్రీతేజ్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తోంది. ఫస్ట్ పార్ట్‌కు అదిరిపోయే ఆల్బమ్ అందించిన డీఎస్పీ మరోసారి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తుండటంతో అంచనాలు భారీగానే ఉన్నాయి.

# మాజీ ప్రేయసితో ప్రేమాట

వెంకటేశ్ 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమా జనవరి 14న విడుదల కానున్న విషయం తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ చివరి దశలో ఉంది. ప్రస్తుతం వెంకటేశ్, ఆయనకు ఎక్స్ గర్ల్ ఫ్రెండ్‌గా నటిస్తున్న మీనాక్షి చౌదరిలపై ఓ అందమైన పాటను దర్శకుడు అనిల్ రావిపూడి చిత్రీకరించే పనిలో ఉన్నారు. డెహ్రాడూన్, ముస్సోరీ, రిషికేశ్‌లోని అద్భుతమైన లొకేషన్స్‌లో ఈ పాట చిత్రకరణ జరుగుతున్నది. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించగా, అనంత శ్రీరామ్ రాసిన ఈ పాటకు భాను మాస్టర్ కొరియోగ్రఫీ అందిస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఈ షెడ్యూల్‌లో ఈ ఒక్క పాటను మాత్రమే చిత్రీకరిస్తామని, త్వరలోనే మ్యూజికల్ ప్రమోషన్స్ మొదలుపెడతామని చిత్ర సమర్పకులు దిల్‌రాజు తెలిపారు. ఐశ్వర్య రాజేష్ మరో కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో ఉపేంద్ర లిమాయే, రాజేంద్రప్రసాద్, సాయికుమార్, నరేష్, వీటీ గణేశ్, మురళీధర్‌గౌడ్ తదితరులు ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: సమీర్‌రెడ్డి, నిర్మాత: శిరీష్, నిర్మాణం: శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్.



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com